క్లుప్తంగా

పాఠశాలలో 'జన్ భగీధరీ'



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జన్ భగీధరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ మేకింగ్ ఇండియా ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అనంతరం శారీరక, మానసిక ఆరోగ్యానికి ముఖ్యమైన యోగాను విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు అరుణశ్రీ , ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కౌలు కార్డుల లక్ష్యాలు పూర్తి చేయాలి

ముప్పాళ్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేసి లక్ష్యాల్ని పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 1700 కార్డులకు గానూ ఇప్పటికి 1353 మందికే కార్డులు అందించామన్నారు. మిగిలిన వారికి కూడా త్వరలో అందించాలని ఆయన ఆదేశించారు. గ్రామాల్లో కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులకు అందేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్.లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

సత్తెనపల్లి: మండల పరిధిలోని బృగుబండ, కందులవారిపాలెం సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.వి. సత్యనారాయణ తెలిపారు. మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది హాజరుకావాలని ఆయన కోరారు.

నెలాఖరులోపు ఈ-కేవైసీ నమోదు తప్పనిసరి

ముప్పాళ్ల: పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందిన రైతులంతా ఈ నెల 31లోపు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ బుధవారం సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో వలంటీర్లు, వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా బయోమెట్రిక్ విధానం లేదా ఫోన్ ఓటీపీ లేదా ముఖచిత్రం ద్వారా గానీ చేయించుకోవచ్చని తెలిపారు. లేనిపక్షంలో ప్రభుత్వం అందించే సాయం నిలిచిపోయే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు.

క్రోసూరులో..

రైతులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో వేణుగోపాల్ తెలిపారు. మండలంలో ఇంకా 1,371 మంది రైతులు చేయించుకోలేదని పేర్కొన్నారు. ఈకేవైసీ చేయించుకోని పక్షంలో పీఎం కిసాన్ నగదు జమ కాదని తెలిపారు. భూమి కలిగిన రైతుల ఖాతాల్లో గురువారం 13 వ విడత పీఎం కిసాన్ నగదు జమ అవుతుందని ఆయన పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద గురువారం పీఎం కిసాన్ నగదు జమ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందని, రైతులంతా వీక్షించాలని ఆయన కోరారు.

పెదకూరపాడులో...

మండలంలోని రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి శాంతి సూచించారు. పీఎం కిసాన్ 14వ విడత నిధులు ఖాతాల్లో జమ కావాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ ఈ నెలాఖరులోపు పూర్తి చేసుకోవాలని ఆమె తెలిపారు. ఇంకా మండలంలోని 1422 మంది రైతులు చేయించుకోవాల్సి ఉందని వెల్లడించారు. ఆయా గ్రామాల రైతులు రైతు భరోసా కేంద్రం లేదా దగ్గర్లోని కామన్ సర్వీస్ సెంటర్‌లో చేయించుకోవాలని ఆమె సూచించారు.

కిచెన్ గార్డెన్‌లతో కుటుంబానికంతా ఆరోగ్యం

రాజుపాలెం: మహిళా గ్రూపుల్లోని సభ్యులంతా ఇంటి పరిసరాల్లో కిచెన్ గార్డెన్ వేయాలని, సేంద్రియ పద్ధతిలో కూరగాయల్ని పండించి తినడం వల్ల కుటుంబ సభ్యులంతా ఆరోగ్యంగా ఉంటారని ఏపీఎం బి.సునీత తెలిపారు. మండలంలోని బలిజేపల్లిలో గల నవోదయ గ్రామ సమైక్య సంఘం ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాలు, మహిళా రైతులతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సునీత మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సున్నా వడ్డీ పథకం, పాల వెల్లువ పథకాన్ని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూనిట్ ఇన్‌చార్జి టి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రధాన పంటల్లో పలు అంతర పంటల్ని వేసుకోవడం వల్ల అధిక లాభాలు వస్తాయని, ఈ దిశగా మహిళా రైతులు కృషి చేయాలని చెప్పారు. రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ గౌతుకట్ల జ్యోతి, సీసీ బాజీ, యానిమేటర్ వెంకటేశ్వరి, ఏ.సునీత, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

రైతుల్లో ఆశల మొలక

- వరుణుడి కరుణతో పంటలకు ఊపిరి
- ఫైర్లు వాడుతున్న దశలో కురిసిన వర్షం
- సత్తెనపల్లి నియోజకవర్గంలో ముందస్తుగా 5,137 హెక్టార్లలో పంటల సాగు
- వర్షాలు తగ్గితే విత్తు వేసేందుకు సిద్ధంగా అన్నదాతలు

సత్తెనపల్లి: ఈ ఏడాది మే, జూన్ ప్రారంభంలోనే ఓ మోస్తరు వర్షాలు కురవడంతో కొందరు రైతులు మందస్తుగా ఖరీఫ్ పంటలు సాగు చేశారు. ఈ తరుణంలో బంగాళఖాతంలో ఏర్పడిన తుపాను వాడుతున్న పంటలకు ఊపిరి పోసింది.

సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో అన్నదాతలు కుదుట పడ్డారు. ఒక్కసారిగా వర్షాలు కురవడంతో పంటలకు ఇబ్బందిలేదనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నారు. వర్షాలు కాస్త తెరిపిస్తే మిగిలిన రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు.

పంటల సాగు ఇలా....

సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో వర్షాలు కురవడంతో రైతులు సాగు చేసిన పంటలకు ఈ వర్షాలు ఊరటనిచ్చాయి. ప్రస్తుతం రైతులు 30 శాతం పైగా పంటలు సాగు చేయగా, మిగిలిన 70 శాతం వర్షాలు తగ్గితే విత్తు వేసేందుకు సమాయత్త మయ్యారు. నియోజకవర్గ పరిధిలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో ఇప్పటికే పత్తి, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేస్తున్నారు.



భీమవరంలో వర్షాలకు ఊపిరి పీల్చుకున్న పత్తి పంట



గండ్లూరులో వర్షాలకు మొలకెత్తిన మొక్కజొన్న

సత్తెనపల్లి డివిజన్‌లో 250 మి.మీ. వర్షపాతం నమోదు

సత్తెనపల్లి: స్థానిక రెవెన్యూ డివిజన్ పరిధిలో బుధవారం 250 మి.మీ. వర్షపాతం నమోదైంది.అత్యధికంగా డివిజన్ పరిధిలోని అమరావతి మండలంలో 56.2 మి.మీ. నమోదు కాగా అత్యల్పంగా నకరికల్లు మండలంలో 12.4 మి.మీ. నమోదైంది. సత్తెనపల్లి 23.2 మి.మీ., ముప్పాళ్ళ 18.2, రాజుపాలెం 13.2 , పెదకూరపాడు 34.2, క్రోసూరు 22.8, అచ్చంపేట 24.6 , బెల్లంకొండ 45.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

నియోజకవర్గంలో సాగు వివరాలు

మండలం	సాధారణ సాగు (హెక్టార్లు)	సాగైన పత్తి (హెక్టార్లు)
సత్తెనపల్లి	7,778	3,361
ముప్పాళ్ళ	3,620	176
రాజుపాలెం	3,500	1,600
నకరికల్లు	8,630	-
మొత్తం	23,528	5,137

వైఎస్సార్ బీమా సాయం పంపిణీ



అచ్చంపేట: మండలంలోని కోనూరు గ్రామానికి చెందిన ఆవుల శ్రీనివాసరావు(45) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం చనిపోగా, 24గంటలు కూడా గడవకముందే వైఎస్సార్ బీమా కింద లక్ష రూపాయలు మంజూరయ్యాయి. ఇందులో తక్షణ సాయంగా వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం మృతుని కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. మిగతా నగదును మృతుని భార్య శ్రీదేవి బ్యాంకు ఖాతాకు జమ చేయనున్నారు. మృతుడు గ్రామంలో టీడీపీ నేత. అయినా ఏమాత్రం వివక్షత చూపకుండా తక్షణమే సహాయం చేసి తమను ఆదుకున్నందుకు మృతిని భార్య శ్రీదేవి, కుమారులు అనిల్, మణి ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు, సీఎం జగన్‌మోహనరెడ్డికి కృతజ్ఞతలు తెలుపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాగెళ్ల శ్రీనివాసరావు, మత్సా శ్రీనివాసరావు, పసుపులేటి జనార్దన్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదల పాలిట శ్రీరామరక్ష

అమరావతి: పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే సదుద్దేశంతో అమలు చేస్తున్న జగనన్న సురక్ష వారి పాలిట శ్రీరామరక్ష అని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. మండల పరిధిలోని మునగోడు సచివాలయ పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్షలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో మాధురి అధ్యక్షత వహించారు. గ్రామస్తుల నుంచి 445 దరఖాస్తులు రాగా అందులో 421 మందికి ధ్రువీకరణ పత్రాల్ని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ సంక్షేమ పథకాలు ఇంటి ముందుకే వచ్చి అందించడతో పాటు వాటిలో సమస్యల్ని పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం సైతం గ్రామాలకు తరలిరావడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇదే మొదటిసారని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలు తీరిన వారి కళ్లల్లో సంతృప్తి కనిపిస్తోందన్నారు. మునగోడును మోడరన్ విలేజ్‌గా తీర్చదిద్దుతానన్న హామీకి కట్టుబడి ఉన్నానని, ఆ దిశగా చర్యలు చేపట్టామని వివరించారు. దేశంలోనే సంక్షేమ పథకాలు అత్యధికంగా అమలు చేస్తున్న రాష్ట్రం మనదే అన్నారు. లబ్ధిదారుల సమస్యలు తీర్చడానికి ప్రభుత్వాన్ని పేదల వద్దకు తెచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి అని కొనియాడారు. పాలనా వ్యవస్థల్లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చి లబ్ధిదారులకు అధికారులు చుట్టూ తిరిగే శ్రమ డబ్బు, సమయం ఆదా చేశామన్నారు. గత ప్రభుత్వ పాలనలో కనీసం రోడ్లు కూడా వేయలేకపోయారని, జగనన్న పాలనలో అమరావతి - బెల్లంకొండ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో 90 శాతానికి పైగా రోడ్లు పూర్తి చేశామని చెప్పారు. నియోజకవర్గంలో ఆస్పత్రుల్ని కూడా పట్టించుకోని ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. నాలుగేళ్లలో నియోజకవర్గంలో ఆస్పత్రుల అభివృద్ధికి రూ.25కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు. రుణమాఫీ, ఉద్యోగాల పేరుతో చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజలు గుర్తుపెట్టుకుని 2024 ఎన్నికలలో కూడా ఓడించి ఇంట్లో కూర్చోబెట్టడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. అలాంటి వ్యవస్థలపై ఆరోపణలు చేస్తూ జనసేన, టీడీపీలు ప్రజల్ని తప్పుదోవ పట్టించాలని ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. టీడీపీ, జనసేన పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాల్సిన ఆయన పిలుపునిచ్చారు.



మునుగోడులో రైతులకు తైవాన్ స్ప్రేయర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



గుండ్లపల్లిలో ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

మునగోడు గ్రామ రైతులకు వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా 15లక్షల రూపాయల విలువైన తైవాన్‌స్ప్రేయర్లు, రోటవేటర్లు వంటి వ్యవసాయ యంత్ర పరికరాల్ని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల హనుమంతరావు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు, మాజీ ఎంపీపీ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు, గ్రామ సర్పంచి విష్ణు, ఉప సర్పంచి మస్తాన్ షరీఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు భవిరిశెట్టి హనుమంతరావు, చిలకా సాంబయ్య, సింగం పుల్లారెడ్డి, పోరెడ్డి శివారెడ్డి, ఉప్పుటూరి నర్సిరెడ్డి, గణపా నర్సిరెడ్డి, బంకా బాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

నకరికల్లు: అర్హత ఉంటే చాలు ప్రభుత్వం పథకం లబ్ధిదారుడి ఇంటికే వస్తుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని గుండ్లపల్లిలో బుధవారం జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హుల్ని గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. అధికారులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. అనంతరం అధికారులు ఆయా శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని శాఖల వారీగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేచారపు అనూరాధ, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏఓ కె.దేవదాసు, ఈఓపీఆర్డీ గిరిధర్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో అలర్లను అరికట్టాలని కోరుతూ ప్రదర్శన

క్రోసూరు: మణిపూర్‌లో హింసాకాండ, అత్యాచారాల్ని అరికట్టాలని కోరుతూ ప్రజాసంఘాలు, అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద ప్లకార్డులతో బుధవారం నిరసన తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లకు అక్కడి అధికార బీజేపీ అవకాశవాద రాజకీయాలే కారణమని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారదర్శకంగా చర్యలు చేపట్టి అల్లర్లను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడి అల్లర్ల కారణంగా దాదాపుగా 60 వేల మంది కుకీలు నిరాశ్రయులయ్యారని తెలిపారు. అక్కడి మహిళలపై జరిగిన దారుణాలు చాలాకాలం తరువాత సోషల్ మీడియా ద్వారా బయటకు వస్తే గానీ మోడీ స్పందించలేదని విమర్శించారు. అక్కడి కుకీల హక్కులు కాలరాయడానికి అల్లర్లను ప్రోత్సహించారని ఆరోపించారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాలు, అఖిల పక్ష పార్టీల నాయకులు

కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు గనుపల్లి రాజశేఖర్, చిల్కా ఏసియా, దుద్దుల యోహాను, ఊరే రోశయ్య, మొగల్ జాను, టి.విజయకుమారి, షేక్ షుక్రాబీ, దుద్దుల స్వప్న, రామాంజనేయులు, దుద్దుల చిన్నప్ప పాల్గొన్నారు.

డీజేలు, బహిరంగ సభలకు అనుమతులు తప్పనిసరి

సత్తెనపల్లి రూరల్ సీఐ కోటేశ్వరరావు



సత్తెనపల్లి: నియోజకవర్గ పరిధిలోని సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో డీజేలు, మైకులు, బహిరంగ ప్రదేశాల్లో సభలు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.కోటేశ్వరరావు చెప్పారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, ఎలాంటి కార్యక్రమం బహిరంగ ప్రదేశంలో నిర్వహించాలన్నా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఇటీవల కొందరు అనుమతులకు విరుద్ధంగా డీజేలు నిర్వహించడం వల్ల ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, మతపరమైన సంస్థలు, నాటకాల నిర్వాహకులు ఎవరైనా సరే బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించాలన్నా, డీజే, మైక్ అనుమతి నిమిత్తం చలానా తీసీ సబంధిత పోలీస్‌స్టేషన్ నుంచి డీఎస్పీకి అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతులకు విరుద్ధంగా డీజేలు, మైకులు పెట్టడం, సభలు నిర్వహించడం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ రాజకీయ పార్టీ వారైనా సరే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతల్ని దృష్టిలో పెట్టుకొని దయచేసి ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

నకరికల్లులో..

పబ్లిక్ ప్రదేశాల్లో పెద్ద శబ్దాలు చేసే డీజే, తీన్‌మార్, మైక్‌లు ఏర్పాటు చేసుకునేందుకు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని ఎస్ఐ ఏ.బాలకృష్ణ సూచించారు. ప్రజలకు ఇబ్బందికి కలిగించే విధంగా పెద్ద శబ్దాలు చేసే మైక్‌లను పెట్టకూడదని తెలిపారు. సభలు, సమావేశాలకు, వేడుకలకు మైక్‌లు ఏర్పాటు చేసేందుకు చలానా కట్టి అనుమతి పొందాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఇంటింటి సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

నకరికల్లు: ఓటరు జాబితాలో వివరాల్ని ఇంటింటి సర్వే ద్వారా పొందుపరచాలని తహసీల్దార్ కె.నగేష్ సిబ్బందికి సూచించారు. మండలంలోని గుండ్లపల్లిలో బుధవారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు, పేర్లు, వివరాల మార్పు కోసం వచ్చిన దరఖాస్తులు గతంలో పరిశీలించి వివరాలు పొందుపరిచినట్లు తెలిపారు. ప్రస్తుత జాబితాలో తప్పొప్పులు సరిదిద్దేందుకు గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. బీఎల్‌ఓలు, వీఆర్వోలు సర్వే చేసి త్వరితగతిన సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుండ్లపల్లిలో ఇంటింటి సర్వే చేస్తున్న తహసీల్దార్ కె.నగేష్

మొక్కపాడులో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



రాజుపాలెం: జోరున వాన పడుతున్నా మండలంలోని సచివాలయం పరిధిలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కృష్ణకుమార్ 99 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందుల్ని పంపిణీ చేశారు. 23 మందికి బీపీ, 29 మందికి షుగర్ మాత్రల్ని అందించారు. సమీపంలోని ఆరోగ్య కేంద్రం వద్దకు వెళ్లి పిల్లలకు పరీక్షలు చేశారు. బరువు తక్కువగా ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక పోషకాల్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. నడవలేని వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షల్ని అందించారు.ఎంఎల్‌హెచ్ శివమాధురి, ఏఎన్ఎం నాగలక్ష్మి, హుస్సేన్, ఆశ కార్యకర్తలు పార్వతి, పద్మావతి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బొల్లాపల్లి: మండలంలోని సీతారామపురం తండాలో పేకాట స్థావరంపై బుధవారం బండ్లమోటు స్టేషన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.29190 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు బండ్లమోటు స్టేషన్ ఎస్ఐ జి. రవికృష్ణ తెలిపారు.

బోధనలో నైపుణ్యంతోనే ఉత్తమ ఫలితాలు

ఈపూరు: ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న బోధన నైపుణ్యాలతో విద్యార్థులకు చక్కగా బోధిస్తేనే చదువులో ఉన్నత స్థానాలు పొందుతారని ఈపూరు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన ఈపూరు జెడ్పీ హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్ సమావేశం బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మొదటగా పాఠశాల సముదాయం సంయుక్త కార్యదర్శిగా ఊడిజర్ల హెచ్‌సీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులును ఎన్నుకున్నారు. సమావేశంలో శిక్షకులు వారికి నూతన మెలకువలు నేర్పించారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు బోధనా నైపుణ్యాలు పెంచుకుని తద్వారా విద్యార్థులకు ఎలా చెబితే అర్థమవుతుందో తెలుసుకొని చక్కగా చెబితే వారి లక్ష్యాలు పూర్తిగా నెరవేర్చిన వారవుతారన్నారు. విద్యార్థుల జ్ఞాపకశక్తి పెంపొందించేలా, పరీక్ష సమయాల్లో ఏ విధంగా బోధిస్తే మంచిగా రాస్తారో అర్థం చేసుకోవాలని సూచించారు. పలు బోధన అంశాల్ని విశదీకరించారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి

వర్షం నీటితో అవస్థలు

అచ్చంపేట: గత రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో నీరు నిలిచి పోయింది. చింతపల్లిలోని గ్రామ సచివాలయం వద్ద కల్వర్టులు మట్టితో పూడిపోవడంతో పైనుంచి వస్తున్న వర్షం నీరు పారుదల లేక గ్రామ సచివాలయాన్ని చుట్టుముట్టింది. అచ్చంపేటలోని మాదిపాడురోడ్డులో పాత సినిమా హాలు సెంటర్, ప్రభుత్వ వైద్యశాల, విద్యుత్ సబ్‌స్టేషన్లలో నీరు నిలిచింది. అధికారులు స్పందించి నీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చింతపల్లి సచివాలయం ముందు నిలిచిన వర్షపు నీరు

కార్గిల్ వీరులను స్మరించుకోవడం మనందరి బాధ్యత

రెంటచింతల: దేశ సరిహద్దుల్లో పాకిస్తాన్ ముష్కరులతో 85 రోజులపాటు జరిగిన కార్గిల్ వార్‌లో అసువులు బాసిన కార్గిల్ వీరులను స్మరించుకోవడం మనందరి బాధ్యతని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, ఎస్ఐ సయ్యద్ షమీర్ బాషా అన్నారు. బుధవారం కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో, పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. 1999 మే 3 నుంచి 1999 జూలై 26 వరకు కార్గిల్ యుద్ధంలో 537 మంది భారత సైనికులు అమరులయ్యారని గుర్తు చేశారు. ఈ యుద్ధంలో భారత సైన్యం పూర్తి విజయం సాధించి దేశ ప్రతిష్ఠను ప్రపంచానికి చాటినట్లు పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో అమర వీరుల చిత్రానికి నివాళి అర్పించారు. పోలీస్ స్టేషన్‌లో కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాసరావు, ఏఎస్ఐ హనుమంతరావు, పోలీసు సిబ్బందితో కలిసి ఎస్ఐ సయ్యద్ షమీర్ బాషా కార్గిల్ వార్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీయూపీ హెచ్ఎం కె.నాగేశ్వరరావు, ఫౌండేషన్ సోషల్ విభాగం కోఆర్డినేటర్ విజయసారథి, ఉపాధ్యాయులు ఎం.బి. చిన్నమ్మ, భీముడునాయక్ పాల్గొన్నారు.



కార్గిల్ వార్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్ఐ సయ్యద్ షమీర్ భాషా, నారాయణపురం శ్రీనివాసరావు

నేరాల నియంత్రణకు చర్యలు

డీఎస్పీ మహేష్

ఈపూరు: నేరాల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు నరసరావుపేట డీఎస్పీ కె.వి.మహేష్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను బుధవారం రాత్రి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండలంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన నకిలీ మిరప విత్తనాల కేసు విచారణ జరుగుతోందన్నారు. మండలంలో రాత్రి పూట గస్తీ పెంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల కూడలి మార్గంలో, అవసరమైన ఏరియాల్లో కెమెరాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. మేజరు గ్రామాల్లో వ్యాపార వాణిజ్య సముదాయాల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అనంతరం పోలీసు సిబ్బందితో మాట్లాడి, రికార్డులు పరిశీలించారు. ఆయనతో పాటు వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్, ఎస్ఐ షేక్ మహమ్మద్ ఫిరోజ్ ఉన్నారు.

తాగునీటి చెరువులకు సాగర్ జలాలు

నాదెండ్ల: తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలు విడుదల కావడంతో మండలంలోని రక్షిత మంచినీటి చెరువులు నింపేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలోని తుర్లపాడు మేజర్, పెదనందిపాడు మేజర్, చిరుమామిళ్ళ మేజర్ ద్వారా చెరువులకు నీళ్ల చేరుతున్నాయి. తుర్లపాడు మేజర్ ద్వారా గణపవరం, నాదెండ్ల, అప్పాపురం, ఎండుగుంపాలెం, పెదనందిపాడు మేజర్ ద్వారా సంకురాత్రిపాడు, గొరిజవోలు, చిరుమామిళ్ల మేజర్ ద్వారా మరికొన్ని గ్రామాలకు సాగర్ జలాలు చేరుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ సూర్యతేజ బుధవారం కాలువల ద్వారా నీటి ప్రవాహాన్ని పర్యవేక్షించారు. ఎండుగుంపాలెం వద్ద సాగర్ జలాలు ఉదయం 6 గంటలకు 106 క్యూసెక్కులు రాగా, రాత్రి 150 క్యూసెక్కులు పెరగవచ్చని అధికారులు అంచనా వేశారు. మరో వారం రోజుల్లో మండలంలోని అన్ని చెరువులు నింపుకోవాలని పంచాయతీ అధికారులు, సర్పంచులను కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగ చోరీ

అమరావతి: జన సంచారం లేకపోవడంతో మండలంలోని పలు జగనన్న కాలనీల్లో అడపాదడపా దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం మండల పరిధిలోని మండెపూడి జగనన్న కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగను దుండగులు చోరీ చేశారు. నెల రోజుల కిందట అమరావతి జగనన్న కాలనీ లేఔట్-3లో సబ్ మెర్సిబుల్ మోటార్లను గుర్తు తెలియని దుండగులు దొంగిలించారు. అంతకు ముందు ధరణికోట లేఅవుట్‌లో కూడా మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగల్ని కూడా ఎత్తుకుపోయారు. ఈ సంఘటనపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశామని విద్యుత్ శాఖ ఏఈ అశోక్ తెలిపారు. భవిష్యత్‌లో చోరీలు జరగకుండా జగనన్న కాలనీలపై పోలీసు నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



దుండగులు పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్